E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 12-07-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



తెలంగాణలో ఇంజినీరింగ్ కళాశాలలకు హైకోర్టులో చుక్కెదురు » 3లో

# అధిష్ఠానం మా పాలనపై పూర్తి సంతృప్తిగా ఉంది



- అధిష్ఠానం మా పాలనపై పూర్తి సంతృప్తిగా ఉంది
- రాష్ట్రంలో సామాజిక న్యాయం, హామీల అమలును ప్రశంసించింది
- ముఖ్యమంత్రి రేవంత్, నేను అవగాహనతో పనిచేస్తున్నాం
- కర్ణాటక తరహాలో తెలంగాణలో 'పవర్ షేరింగ్' ఏమీ లేదు
- ఢిల్లీలో మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇష్టాగోష్ఠి

ఈకబురు, న్యూఢిల్లీ, : తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పనితీరు పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి సంతృప్తిగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఇటీవల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రాష్ట్రానికి వచ్చి సమీక్ష జరిపిన తర్వాత.. తెలంగాణలో సామాజిక న్యాయం, ప్రభుత్వ హామీల అమలు తీరును ప్రశంసించారని తెలిపారు. భట్టి శుక్రవారం ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణలో కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్నబియ్యం, ఉద్యోగాల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణాల మాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆదాయం ప్రతినెలా రూ.16 వేల కోట్ల వరకు ఉంటుందని... సుమారు రూ.

తరువాయి 2లో

# హిమాచల్ ప్రదేశ్‌లో వరదలు.. 150 కి.మీ. దూరంలో మృతదేహాలు

ఈ కబురు: హిమాచల్ ప్రదేశ్‌లో వరద ఉద్ధృతి ఇంకా కొనసాగుతోంది. మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 91కి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడటం.. మెరుపు వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా ఉంది. వరద ఉద్ధృతి కారణంగా కొట్టుకుపోయిన మృతదేహాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వరద నీటిలో కొట్టుకుపోయిన మృతదేహాలు రహదారులపై పదుల సంఖ్యలో పడి ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. హిమాచల్‌లోని పంగ్లుయెడ్ గ్రామంలో ఇటీవల రెండు కుటుంబాలకు చెందిన తొమ్మిది మంది గల్లంతయ్యారు. వారిలో నలుగురి మృతదేహాలు దాదాపు 150 కి.మీ. దూరంలో ఉన్న జ్వాలాపూర్‌లో లభ్యమవగా.. మరో ఐదుగురి ఆచూకీ ఇంకా తెలియకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాలు చాలాదూరం కొట్టుకుపోతుండడంతో వాటిని గుర్తించి.. వారి కుటుంబాలకు అప్పగించడం కూడా సవాలుగా మారిందని అధికారులు పేర్కొన్నారు.


తరువాయి 2లో



# జీఎస్టీ వసూళ్లలో దేశానికి ఏపీ రోల్‌మోడల్‌గా ఉండాలి: సీఎం చంద్రబాబు

ఈ కబురు,అమరావతి: జీఎస్టీ వసూళ్లలో దేశానికి ఏపీ రోల్‌మోడల్‌గా ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కేంద్ర-రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. డేటా అనలిటిక్స్‌లాంటి సాంకేతికతను వినియోగించి పన్ను ఎగవేతలను అడ్డుకోవాలని

తరువాయి 2లో



వింబుల్డన్ మ్యాచ్‌లో జాన్వీ కపూర్.. బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి! » 5లో



ఐటీ షేర్లు టపటప.. భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు » 4లో



# బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్..

## రైల్ రోకో వాయిదా: ఎమ్మెల్సీ కవిత



ఈ కబురు,హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతో

తరువాయి 2లో

# 'అయ్యా రేవంత్.. 400 ఏళ్ల కింద కట్టిన ప్రాజెక్ట్‌లు నీవేనా?'


ఈ కబురు, బీఆర్‌కే భవన్: దేశానికి స్వాతంత్ర్యం రాకముందు కట్టిన ప్రాజెక్టులను రేవంత్ రెడ్డి ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి హరీష్ రావు. నీళ్ల విషయంలో కాంగ్రెస్ తెలంగాణకు అన్యాయం చేసింది.

తరువాయి 2లో



తరువాయి 2లో

# రష్యా చమురు కొంటే 500 శాతం టారిఫ్.. అమెరికా నిర్ణయంతో భారత్‌కు షాక్



ఈ కబురు: రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్ సహా ఇతర దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. రష్యా ఆంక్షల బిల్లును మద్దతిచ్చే విషయంపై తీవ్రంగా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. కేబినెట్ సమావేశంలో భాగంగా ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేలా రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. '

తరువాయి 2లో

# చైనా పర్యటనకు వెళ్లనున్న విదేశాంగశాఖ మంత్రి జై శంకర్!

ఈ కబురు ,ఢిల్లీ: విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ చైనా పర్యటనకు వెళ్లనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది. భారత్, చైనా మధ్య ప్రతిష్టంభన పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఇరుదేశాల విదేశాంగ మంత్రుల భేటీపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, జులై 14, 15 తేదీల్లో టియాంజిన్ వేదికగా షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) కౌన్సిల్ సమావేశం జరగనుంది. బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చల అనంతరం జై శంకర్ అక్కడికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.



తరువాయి 2లో

## రాజాసింగ్ రాజీనామా ఆమోదించిన భాజపా

»3లో



## యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి: మంత్రి శ్రీధర్ బాబు

»3లో



# అమెరికా తెలంగాణల మధ్య స్నేహపూర్వక సంబంధాలు : సీఎం రేవంత్ రెడ్డి



ఈ కబురు : అమెరికా తెలంగాణల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ కాన్సూల్ జెనరల్ జెన్నిఫర్ లార్సన్ ఇచ్చిన దౌత్యపరమైన విందులో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అమెరికా తెలంగాణల మధ్య వాణిజ్యపరమైన సంబంధాలు మరింత మెరుగుపరచడానికి తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. తెలంగాణను 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్, అలాగే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తెలంగాణ రైజింగ్ దార్శనికతతో పని చేస్తున్నామని వివరిస్తూ అందుకు అమెరికన్ల మద్దతు కావాలని కోరారు. "అమెరికాకు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ప్రపంచంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రపంచం ముందు అమెరికా అనేక సానుకూలతలను ప్రదర్శించింది. ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా, నిరంతరం ఆవిష్కరణలతో ప్రపంచ దృక్కోణాన్ని మార్చింది. ఎల్లప్పుడూ బలమైన దేశంగా.. అనేక అంశాల్లో సానుకూల పరిష్కారాలు చూపించడంలో అమెరికా స్ఫూర్తిని ప్రదర్శించింది. అమెరికా స్ఫూర్తికి తెలంగాణ స్ఫూర్తికి మధ్య ఎంతో సారూప్యత ఉంది. స్నేహ బంధాన్ని కోరుకోవడమే కాకుండా దాన్ని మరింత పటిష్టపరుచుకోవడం తెలంగాణ ప్రత్యేకత. 2008 లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఏర్పాటైంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ప్రారంభించబడిన మొట్టమొదటి యూఎస్ దౌత్య కార్యాలయం ఇదే కావడం గమనార్హం. భారత దేశంతో దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో అమెరికా ఎప్పుడూ నిబద్ధతని ప్రదర్శించింది. అమెరికాతో తెలుగు ప్రజలకు ఉన్న స్నేహపూర్వకమైన బంధం ఎంతో బలమైంది.

తరువాయి 2లో

అమెజాన్‌లోనే కొంటున్నారా? అమ్మో జాగ్రత్త! » 4లో




ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు.. రెండో రోజు ముగిసిన ఆట » 6లో



మొదటి పేజీ తరువాయి

# అధిష్ఠానం మా పాలనపై పూర్తి సంతృప్తిగా ఉంది

ఈకబురు, న్యూఢిల్లీ, : తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పనితీరు పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి సంతృప్తిగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఇటీవల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రాష్ట్రానికి వచ్చి సమీక్ష జరిపిన తర్వాత.. తెలంగాణలో సామాజిక న్యాయం, ప్రభుత్వ హామీల అమలు తీరును ప్రశంసించారని తెలిపారు. భట్టి శుక్రవారం ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణలో కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్నబియ్యం, ఉద్యోగాల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణాల మాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆదాయం ప్రతినెలా రూ.16 వేల కోట్ల వరకు ఉంటుందని... సుమారు రూ.7 వేల కోట్లు పథకాలకు, రూ.5,500 కోట్లు జీతాలకు, రూ.6,300 కోట్లు అప్పులు, వడ్డీల చెల్లింపునకు ఖర్చవుతున్నాయని భట్టి చెప్పారు. ఆదాయ వనరుల సమీకరణపై దృష్టిపెట్టామని తెలిపారు. అవసరమైనప్పుడు భూములు అమ్మడంలో తప్పేమీ లేదన్నారు. గత ప్రభుత్వాధినేతలు చేసిన అక్రమాలపై చట్టపరంగా శిక్షలు ఉంటాయని, ఉపేక్షించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయని ఆయన కుమార్తె కవిత స్వయంగా అన్నారని, ప్రజల్లో బీఆర్ఎస్ ప్రతిష్ఠ పూర్తిగా పడిపోయిందని వ్యాఖ్యానించారు. ఏపీలో జగన్‌లా కేసీఆర్ కూడా అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలో 150కి పైగా అసెంబ్లీ స్థానాలు ఉంటాయని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**కలసికట్టుగా పనిచేస్తున్నాం..**

సీఎం రేవంత్‌రెడ్డి, తాను మంచి అవగాహనతో కలసికట్టుగా పనిచేస్తున్నామని, తమ మధ్య ఎలాంటి సమస్యలూ లేవని భట్టి తెలిపారు. కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అధికారం విషయంలో నెలకొన్న స్పర్థలను మీడియా ప్రస్తావించగా.. కర్ణాటకలో లాగా తెలంగాణలో అధికారం పంచుకునే ఏర్పాటు (పవర్ షేరింగ్ అరేంజ్‌మెంట్) ఏమీ లేదని స్పష్టం చేశారు. మంత్రి పదవుల ఆకాంక్షలు ఉండటంలో తప్పేమీ లేదన్నారు. తదుపరి మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

**రాంచందర్‌రావును పదవి నుంచి తొలగించాలి**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) దళిత విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన ఎన్.రాంచందర్‌రావుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడం దారుణమని భట్టి పేర్కొన్నారు. బీజేపీ నాయకత్వం రాంచందర్‌రావును వెంటనే పదవి నుంచి తొలగించి, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ''హెచ్‌సీయూలో ఆత్మగౌరవంతో బతకడానికి కావాల్సిన హక్కులు కల్పించాలంటూ వైస్ చాన్సలర్‌కు అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ వినతిపత్రం ఇచ్చింది. అప్పట్లో వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడిగా ఉన్న సుశీల్‌కుమార్ దీనిని జీర్ణించుకోలేక ఆ విద్యార్థులను దేశద్రోహులుగా చిత్రీకరించారు. తర్వాత బీజేపీ నేతలు రంగంలోకి దిగారు. రోహిత్ వేముల, మరో నలుగురిపై కేసులు పెట్టాలంటూ రాంచందర్‌రావు గుండాలతో వచ్చి ధర్నాకు దిగారు. వీసీపై, అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో యూనివర్సిటీ అధికారులు రోహిత్ వేముల, మిగతా వారిని బయటికి పంపేశారు. అది తట్టుకోలేక రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నారు'' అని భట్టి చెప్పారు. అలాంటి రాంచందర్‌రావును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, అప్పటి ఏబీవీపీ నేత సుశీల్‌కుమార్‌ను ఢిల్లీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించడం బీజేపీ దళిత వ్యతిరేక వైఖరిని స్పష్టం చేస్తోందని ఆరోపించారు. దళిత వ్యతిరేకులకే బీజేపీ పదోన్నతులు, ప్రోత్సాహకాలు ఇస్తోందని విమర్శించారు. రోహిత్ వేముల ఆత్మహత్య కేసును తిరిగి తెరిచేందుకు కోర్టు అనుమతి కోరుతామని తెలిపారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కట్టుదిట్టంగా అమలు చేసేందుకు రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు.



మొదటి పేజీ తరువాయి

# 'అయ్యా రేవంత్.. 400 ఏళ్ల కింద కట్టిన ప్రాజెక్ట్‌లు



ఈ కబురు, బీఆర్‌కే భవన్: దేశానికి స్వాతంత్ర్యం రాకముందు కట్టిన ప్రాజెక్టులను రేవంత్ రెడ్డి ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి హరీష్ రావు. నీళ్ల విషయంలో కాంగ్రెస్ తెలంగాణకు అన్యాయం చేసింది. 50ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీవి.. అవే మోసాలు, అవే అబద్ధాలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న చెప్పినవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు చెప్పినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందా? అని ప్రశ్నించారు.మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు బీఆర్‌కే భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ..'ప్రజా భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు.. కవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుకోవడానికి కవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్‌కు అవగాహన లేదని బాధతో చెప్తున్నా. 299 టీఎంసీల పేరుతో శాశ్వత ఒప్పందం అని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డికి చేతకాక కిరణ్ కుమార్ రెడ్డి ఆనాడే 299 టీఎంసీలు ఉమ్మడి రాష్ట్రంలో ఒప్పందం చేశారు.

**చంద్రబాబుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారా..**

శాశ్వత ఒప్పందం కేసీఆర్ చేసి ఉంటే సెక్షన్3పై ఎందుకు పోరాటం చేస్తారు?. సెక్షన్3 విషయంలో ఉమా భారతి, గడ్కరీని కలిశారు. కేంద్రంపై పోరాటం చేసి సెక్షన్3ని కేసీఆర్ సాధించారు. బోర్డు తాత్కాలిక నీటి వినియోగం కోసం మాత్రమే వినియోగిస్తారు. కృష్ణా నదిలో తెలంగాణ వాటాను సాధించాలని కోరుతున్నాను. రేవంత్ రెడ్డి అజ్ఞానంతో మాట్లాడారు.. చాలా బాధతో చెప్తున్నాను. కృష్ణా నదిని దోచుకో అని రేవంత్ రెడ్డి.. చంద్రబాబుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అజ్ఞానాన్ని నేను బయటపెట్టిన తర్వాత సీఎం మాట మార్చారు.


**నిజాం కట్టినవి నీవేనా..**

సీఎం రేవంత్‌కి ఎలాగూ తెలియదు.. ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా తెలియదు అంటే బాధేస్తోంది. చంద్రబాబు చెప్పినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందా?. 573 టీఎంసీలు చాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పడం అజ్ఞానం. 400 ఏళ్ల కింద కాకతీయ, నిజాం కాలంలో కట్టిన ప్రాజెక్టులను రేవంత్ రెడ్డి ఖాతాలో వేసుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు కట్టిన ప్రాజెక్టులను రేవంత్ రెడ్డి ఖాతాలో వేసుకున్నారు. కాంగ్రెస్ ఆరు లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తే.. బీఆర్ఎస్ పాలనలో 48 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం.

తుమ్మిడిహట్టి నుంచి బ్యారేజీ మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని తప్పుపడుతున్నారు. కేంద్రం అనుమతి ఇచ్చింది.. దీనిపై కేంద్రాన్ని ప్రశ్నించు. ఎనిమిదేళ్లలో 160 టీఎంసీలకు కేంద్రం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అనుమతి తేలేదు?. దీనిపై అసెంబ్లీలో చర్చకు మేము సిద్ధం. మా మైక్ కట్ చేయకుండా, అసెంబ్లీ నుంచి పారిపోవద్దు. 20 నెలల పాలనలో ఇప్పుడు ఒక్క చెరువు, చెక్ డ్యామ్ కట్టించారా?. మీరు ఏమీ చేయకుండానే నీళ్లు ఎలా వచ్చాయి.. పంటలు ఎలా పండాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను వాడటం లేదు.. ఆరు శాతం నీళ్లను తక్కువగా వాడారు' అని చెప్పుకొచ్చారు.

మొదటి పేజీ తరువాయి

# జీఎస్టీ వసూళ్లలో దేశానికి ఏపీ రోల్‌మోడల్‌గా ఉండాలి: సీఎం చంద్రబాబు



ఈ కబురు,అమరావతి: జీఎస్టీ వసూళ్లలో దేశానికి ఏపీ రోల్‌మోడల్‌గా ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కేంద్ర-రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. డేటా అనలిటిక్స్‌లాంటి సాంకేతికతను వినియోగించి పన్ను ఎగవేతలను అడ్డుకోవాలని అధికారులకు సూచించారు. సమర్థమైన పన్ను వసూళ్ల ప్రక్రియ ద్వారా జాతీయ సంపదను పెంచాలని.. దాన్ని ప్రజల సంక్షేమం, అభివృద్ధికి వినియోగించాలన్నారు.

జీఎస్టీ రియలైజేషన్ కోసం కేంద్ర-రాష్ట్ర అధికారుల మధ్య సమాచార సమన్వయం ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. జీఎస్టీ వసూళ్లకు సంబంధించి పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేలా కార్యాచరణ ఉండాలన్నారు. ఎగవేతలను గుర్తించేందుకు విద్యుత్ వినియోగం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో ఎక్కడా పొరపాటు జరగకుండా చూసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎలాంటి పన్ను ఎగవేతలకు అవకాశం లేకుండా చూడాలని జీఎస్టీ అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లలో 3.4 శాతం వృద్ధి నమోదైందని అధికారులు ఆయనకు వివరించారు. త్వరలోనే విశాఖ, విజయవాడల్లో ఏర్పాటు కానున్న జీఎస్టీ ట్రైబ్యునళ్ల ద్వారా పన్ను వివాదాలు పరిష్కారమవుతాయని తెలిపారు. సెంట్రల్ జీఎస్టీ జోనల్ కార్యాలయం, క్వార్టర్ల నిర్మాణం కోసం అమరావతిలో 5 ఎకరాల భూమి కేటాయించాలని కేంద్ర అధికారులు సీఎంకు విన్నవించారు.

మొదటి పేజీ తరువాయి

# అమెరికా తెలంగాణల మధ్య స్నేహపూర్వక సంబంధాలు : సీఎం రేవంత్ రెడ్డి



ఈ కబురు : అమెరికా తెలంగాణల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ కాన్సూల్ జెనరల్ జెన్నిఫర్ లార్సన్ ఇచ్చిన దౌత్యపరమైన విందులో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అమెరికా తెలంగాణల మధ్య వాణిజ్యపరమైన సంబంధాలు మరింత మెరుగుపరచడానికి తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. తెలంగాణను 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్, అలాగే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తెలంగాణ రైజింగ్ దార్శనికతతో పని చేస్తున్నామని వివరిస్తూ అందుకు అమెరికన్ల మద్దతు కావాలని కోరారు. "అమెరికాకు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ప్రపంచంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రపంచం ముందు అమెరికా అనేక సానుకూలతలను ప్రదర్శించింది.ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా, నిరంతరం ఆవిష్కరణలతో ప్రపంచ దృక్కోణాన్ని మార్చింది. ఎల్లప్పుడూ బలమైన దేశంగా.. అనేక అంశాల్లో సానుకూల పరిష్కారాలు చూపించడంలో అమెరికా స్ఫూర్తిని ప్రదర్శించింది. అమెరికా స్ఫూర్తికి తెలంగాణ స్ఫూర్తికి మధ్య ఎంతో సారూప్యత ఉంది. స్నేహ బంధాన్ని కోరుకోవడమే కాకుండా దాన్ని మరింత పటిష్టపరుచుకోవడం తెలంగాణ ప్రత్యేకత. 2008 లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఏర్పాటైంది. స్వాతంత్రానంతరం భారతదేశంలో ప్రారంభించబడిన మొట్టమొదటి యూఎస్ దౌత్య కార్యాలయం ఇదే కావడం గమనార్హం. భారతదేశంతో దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో అమెరికా ఎప్పుడూ నిబద్ధతని ప్రదర్శించింది. అమెరికాతో తెలుగు ప్రజలకు ఉన్న స్నేహపూర్వకమైన బంధం ఎంతో బలమైంది. అమెరికాలో తెలుగు భాష వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎంతో మంది ఇక్కడి విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకోవడానికి అమెరికా వెళుతున్నారు. హైదరాబాద్ కాన్సూల్ జనరల్ శ్రీమతి జెన్నిఫర్ లార్సన్ రెండు సంస్కృతుల మధ్య, ప్రజల మధ్య, అలాగే, వాణిజ్యపరమైన సంబంధాలను పటిష్టపరచడంలో, ఇరు దేశాల మధ్య బలమైన వారధిగా నిలుస్తున్నారు. ఐటీ, ఫార్మా, డిఫెన్స్, మాన్యుఫాక్చరింగ్, ఏరోస్పేస్ వంటి రంగాలకు చెందిన దాదాపు 200 అమెరికా కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా ప్రస్తుతం పనిచేస్తున్నాయి. జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసం, విలువల ఆధారంగా అమెరికా భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోంది. హైదరాబాద్ మరింత పురోభివృద్ధి సాధించాలని, అమెరికాలోని అత్యుత్తమైన వాటిని తెలంగాణకు తీసుకొస్తారని నేను ఆశిస్తున్నా. ఈ వేడుకలకు థీమ్‌గా నిర్దేశించిన కోణంలో చెప్పాలంటే.. "ఒక్కటిగా ఉంటే.. మరింత పటిష్టంగా.." ఎదగగలమని నేను విశ్వసిస్తున్నా.." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విందులో హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సూల్ జనరల్ కార్యాలయ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్.. రైల్ రోకో వాయిదా: ఎమ్మెల్సీ కవిత

ఈ కబురు,హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. అంతకుముందు బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి జాగృతి శ్రేణులతో ర్యాలీగా లోయర్ ట్యాంక్‌బండ్‌కు వెళ్లారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె నివాళులర్పించారు.''స్థానిక ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నాం. అయితే మాకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయి. ఆర్డినెన్స్ ఇచ్చి వెంటనే రిజర్వేషన్లు అమలు చేయగలిగితే అధికారంలోకి వచ్చిన 18 నెలలు ఎందుకు ఆగారు? రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని మేం భావిస్తున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారు.ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బంది పడుతున్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయి. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్నందున భాజపా అనుకుంటే ఒకే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదు.. కానీ ఇవ్వడం లేదు. దోషమంతా కాంగ్రెస్‌పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమో. ప్రజలు గమనిస్తున్నారు. బీసీ బిల్లును షెడ్యూల్9లో పెట్టాలి. దీనికోసం బీసీ బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలి. ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పినందున ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనిస్తాం. దీనిపై ముందుకెళ్లకపోతే రైల్ రోకో చేపడతాం'' అని కవిత అన్నారు.



# రష్యా చమురు కొంటే 500 శాతం టారిఫ్..

## అమెరికా నిర్ణయంతో భారత్‌కు షాక్

ఈ కబురు: రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్ సహా ఇతర దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. రష్యా ఆంక్షల బిల్లును మద్దతిచ్చే విషయంపై తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కేబినెట్ సమావేశంలో భాగంగా ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేలా రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 'సాంక్షనింగ్ రష్యా యాక్ట్ 2025' పేరుతో బిల్లును ప్రవేశపెట్టేందుకు అమెరికా నిర్ణయం తీసుకుంది. రష్యా నుంచి చమురు, గ్యాస్, ఇంధనం కొనుగోలు చేసే దేశాలపై అత్యంత కఠినమైన సుంకం విధించడమే ఈ బిల్లు లక్ష్యం. దీంతో అమెరికా నిర్ణయంతో భారత్ పై తీవ్ర ప్రభావం పడే చాన్స్ ఉంది. ఎందుకంటే రష్యా ఉక్రెయిన్ యుద్ధం నుంచి భారత్ రష్యా నుంచి ఎక్కువగా చమురు కొనుగోలు చేస్తుంది. రష్యన్ చమురులో దాదాపు 35 శాతం కొనుగోలు చేస్తున్నది.

ట్రంప్ ప్రకటనపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పందించారు. రష్యా చమురు కొనడం వల్ల ప్రపంచానికి మేలే జరిగిందని, లేదంటే చమురు ధరలు మోతమోగేవని తెలిపారు. రష్యన్ చమురుపై ప్రపంచ ఆంక్షలు ఎప్పుడూ లేవన్నారు. ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా వాస్తవికతలను తెలుసుకుని భారత్ సాధ్యమైన చోటల్లా ఒక నిర్దిష్ట ధర పరిధిలో సబ్సిడీ చమురును కొనుగోలు చేస్తుందని, ఈ చర్య ప్రపంచ మార్కెట్లకు ఎంతో సహాయం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచ చమురు మార్కెట్‌ను స్థిరంగా ఉంచడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.



# చైనా పర్యటనకు వెళ్లనున్న విదేశాంగశాఖ మంత్రి జై శంకర్!

ఈ కబురు ,ఢిల్లీ: విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ చైనా పర్యటనకు వెళ్లనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది. భారత్, చైనా మధ్య ప్రతిష్టంభన పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఇరుదేశాల విదేశాంగ మంత్రుల భేటీపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, జులై 14, 15 తేదీల్లో టియాంజిన్ వేదికగా షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) కౌన్సిల్ సమావేశం జరగనుంది. బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చల అనంతరం జై శంకర్ అక్కడికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

దెబ్బతిన్న సంబంధాలను సరిదిద్దుకునేందుకే శిఖరాగ్ర సమావేశానికి ముందే ఇరుదేశాల నేతలు ప్రత్యేకంగా భేటీ భేటీ అవుతున్నట్లు సమాచారం. దలైలామా వారసత్వంపై ఇటీవల చెలరేగిన వివాదం, భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు, ఇరుదేశాల మధ్య విమానాల పునరుద్ధరణ తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇటీవల చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. జూన్‌లో చైనాలోని క్వింగ్డావోలో షాంఘై సహకార సంస్థ సభ్యదేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సుకు ఆయన హాజరయ్యారు.

# హైటెన్షన్ విద్యుత్ స్థంభం ఎక్కి యువకుడు హల్ చల్



హై టెన్షన్ విద్యుత్ స్థంభం ఎక్కిన యువకుడు



హై టెన్షన్ విద్యుత్ స్థంభం ఎక్కిన యువకుడు

## నచ్చజెప్పి కిందికి దించిన గచ్చిబౌలి పోలీసులు

ఈకబురు, శేరిలింగంపల్లి : కొద్ది రోజులుగా తీవ్ర మానసిక ఒత్తిడి, మనోవేదనతో బాధపడుతున్న యువకుడు శుక్రవారం హైటెన్షన్ విద్యుత్ స్థంభం ఎక్కి హల్ చల్ చేశాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని యువకుడికి నచ్చచెప్పి కిందకు దించారు. కొండాపూర్ లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మహారాష్ట్రకు చెందిన ఆకాష్ అర్కం(31) కొండాపూర్ రాజరాజేశ్వరి నగర్ లో నివాసం ఉంటున్నాడు గత కొద్ది రోజులుగా తీవ్ర మానసిక ఇబ్బందులతో, మతిస్థిమితం లేకుండా బాధపడుతున్న ఆకాష్ అర్కం తన సోదరుడి వద్ద ఉంటున్నాడు. కాగా శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆకాష్ ఆర్కం బట్టలు లేకుండా నగ్నంగా రాఘవేంద్ర కాలనీ లో ఉన్న హై టెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ స్తంభం చివరి వరకు వెళ్లి అక్కడ నుంచి దూకు తానంటూ బెదిరింపులకు దిగాడు. స్థానికులు వారించి కిందకు దిగాలని కోరినా వినిపించుకోలేదు. ఒక్క చేత్తో విద్యుత్ స్థంభం ఇనుపరాడును పట్టుకొని వేలాడుతుండడం... యువకుడికి కొద్ది దూరంలోనే హై టెన్షన్ వైర్లు ఉండడంతో ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మైక్ సెట్ ద్వారా యువకుడికి నచ్చ చెప్పేందుకు ప్రయత్నించారు. విద్యుత్ స్థంభం సగానికి దిగిన యువకుడు మరోసారి అక్కడే బైఠాయించడంతో గంటపాటు హైటెన్షన్ నెలకొంది. చివరికి పోలీసులు నచ్చజెప్పి కిందకు దింపి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం సోదరునికి అప్పగించారు.

# ఐటీ కారిడార్ లో అర్ధరాత్రి సోమాలియా యువకుడిపై కత్తిపోట్లు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : చదువుకునేందుకు సోమాలియా నుంచి నగరానికి వచ్చిన యువకుడు ఐటి కారిడార్ లో కత్తిపోట్లకు గురయ్యాడు. బైక్ మీద వెళ్తున్న ఇద్దరు సోమాలియా యువకులకు మరో బైక్ మీద వెళుతున్న యువకులతో ఏర్పడిన వివాదం దాడికి దారి తీసింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. సామాలియా దేశానికి చెందిన అహ్మద్(25) హిమాయత్ నగర్ లోని ఓ కాలేజీలో బీసీఏ రెండవ సంవత్సరం చదువుతూ మాసబ్ ట్యాంక్ లో నివాసం ఉంటున్నారు. ఒడిస్సాలో చవుకుంటున్న తన స్నేహితుడు, సోమాలియా దేశానికే చెందిన యూనిస్ అబ్ది కరీం హసన్(22) వద్దకు కొన్నిరోజుల క్రితం అహ్మద్ వచ్చాడు. ఇద్దరు కలిసి ఈ నెల 8వ తేదీన అర్ధరాత్రి అవేంజర్ బైక్ మీద చాయ్ తాగేందుకు ఐటీ కారిడార్ కు వచ్చారు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నాలెడ్జ్ సిటీ సమీపంలోని ఐకియా వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా, పక్కనే మరో బైక్ మీద వెళ్తున్న ఇద్దరు గుర్తు తెలియని యువకులతో గొడవ జరిగింది. దీంతో సదరు గుర్తు తెలియని యువకులు మరో ఇద్దరు స్నేహితులను అక్కడికి పిలిపించారు. నలుగురు కలిసి సోమాలియా యువకుల మీద దాడికి పాల్పడ్డారు. గుర్తు తెలియని యువకుల్లో ఓ యువకుడు తన వెంట తెచ్చుకున్న కత్తితో సోమాలియా విద్యార్థి అహ్మద్ కడుపులో పొడిచి అక్కడి నుంచి పారిపోయారు. అహ్మద్ కు తీవ్ర గాయం కావడంతో మాదాపూర్ లోని మెడికోవర్ ఆసుపత్రికి తరలించారు. అహ్మద్ కు శస్త్రచికిత్స చేయగా ప్రస్తుతం కోలుకుంటున్నాడు.బాధితుడి స్నేహితుడు యూనిస్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన యువకుల కోసం పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. నిందితుల బైక్ నెంబర్లు కనిపించకపోవడంతో ఐటీ కారిడార్ రహదారుల మీద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# బసవతారక నగర్ లో పర్యటించిన బీఆర్ఎస్ నాయకులు



బసవతారక నగర్ వాసులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



బసవతారక నగర్ వాసులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గౌలిదొడ్డి బసవతారక నగర్ లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు పర్యటించారు. ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న గుడిసె వాసులను ప్రైవేటు వ్యక్తులు ఖాళీ చేయిస్తుండడంతో గుడిసెవాసులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్ కుమార్, నవీన్ కుమార్, మాజీ కార్పొరేటర్ కొమిరిషెట్టి సాయిబాబాలు పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బసవతారక నగర్ లో గత కొద్ది రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలను బాధితులు, మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చాక నిరుపేదలను, శ్రమజీవులను నిలువ నీడ లేకుండా చేస్తుందని అన్నారు. ముఖ్యంగా 30 ఏళ్ల క్రితం పొట్ట చేత పట్టుకుని వచ్చి, బసవతారక నగర్ లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న నిరుపేద బిడ్డలపై ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండించారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ లోని కాలనీల కూల్చివేతలకు పాల్పడుతున్నారని అన్నారు. బాధితులకు అండగా, పేద ప్రజల కోసం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిలబడుతారని, పోరాటం చేస్తారని అన్నారు. బసవతారక నగర్ లో బాధితులకు పక్కా ఇళ్లను కట్టించి.. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవికుమార్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, వాలా హరీష్ రావు, రాగం జంగయ్య యాదవ్, గుర్ల తిరుమలేష్, రాజు ముదిరాజ్, అనిల్ సింగ్ ,పరమేష్, అంజమ్మ, దారుగుపల్లి నరేష్, పార్నంది శ్రీకాంత్, రామకృష్ణ గౌడ్, గోపరాజు శ్రీనివాస్, రోజా, కే ఎన్ రాములు, ముద్దంగుల మల్లేష్, ఎర్రబెల్లి సతీష్, రాజు, నవీన్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీహార్‌లో ఓట్ల చోరీకి కుట్ర.. ఈసీపై రాహుల్ విమర్శలు

భువనేశ్వర్: అసెంబ్లీ ఎన్నికల వేళ బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. బీహార్‌లో 'ఎన్నికల చోరీ' కి ఈసీ కుట్ర పన్నుతోందని అన్నారు. భువనేశ్వర్‌లో శుక్రవారంనాడు జరిగిన 'సంవిధాన్ బచావో సమావేశ్'లో ఆయన మాట్లాడుతూ, బీజేపీ వింగ్‌గా ఈసీఐ పని చేస్తోందని అన్నారు. మహారాష్ట్రలో చేసినట్టే బీహార్‌లోనూ ఎన్నికల చోరీకి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.'రాజ్యాంగంపై బీజేపీ దాడి చేస్తోంది. నిన్న నేను బీహార్‌లో ఉన్నాను. మహారాష్ట్రలో ఏవిధంగా అయితే ఎన్నికల చోరీ జరిగిందో బీహార్‌లోనూ అదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్నికల చోరీకి ఈసీ కొత్త కుట్ర చేస్తోంది. ఈసీ ఏ పని చేయాలో అది చేయకుండా బీజేపీ వింగ్ తరహాలో పనిచేస్తోంది' అని రాహుల్ విమర్శించారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహావికాస్ అఘాడి కూటమికి జరిగిన నష్టంపై మాట్లాడుతూ, కొత్తగా కోటి మంది ఓటర్లను అప్పడు చేర్చారని అన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య కొత్తగా కోటి ఓటర్లు వచ్చి చేరారని, వీళ్లంతా ఎవరో ఎక్కడి నుంచి వచ్చారో ఎవ్వరికీ తెలియదని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా, వీడియోగ్రఫీ తమకు ఇవ్వాల్సిందిగా ఎన్నోసార్లు ఈసీని కోరినా నిరాకరించిందని చెప్పారు.పేద ప్రజలను ఒడిశా ప్రభుత్వం దోచుకుంటోందని రాహుల్ విమర్శించారు. ఇంతకుముందు బీజేడీ ప్రభుత్వం, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం అదే పని చేస్తున్నాయని అన్నారు. ఒకవైపు ఒడిశా పేద ప్రజలు, దళితులు, వెనుకబడిన తరగతులు, రైతులు, కార్మికులు ఉంటే మరోవైపు ఐదారుగురు బిలియనీర్లు, బీజేపీ ప్రభుత్వం ఉన్నాయని చెప్పారు. వీరి మధ్య పోరాటం కొనసాగుతూనే ఉందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కరు మాత్రమే దీనిపై పోరాడుతున్నారని చెప్పారు. రథయాత్ర సందర్భంగా పూరీ జగన్నాథుని రథాలను గౌతమ్ అదానీ కోసమే ఆపారని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఒడిశా ప్రభుత్వాన్ని అదానీ నడుపుతున్నారు. అదానీ నరేంద్ర మోదీని నడుపుతున్నారు. జగన్నాథుని రథాలను లాగుతున్నప్పుడు లక్షలాది మంది అందులో పాల్గొన్నారు. అప్పడొక డ్రామా జరిగింది. అదానీ, ఆయన కుటుంబ సభ్యుల కోసం రథాలను ఆపారు. దీనిని బట్టే ఒడిశా ప్రభుత్వం గురించి అందరూ అర్థం కోవచ్చుకోవచ్చు' అని రాహుల్ చెప్పారు.

# రాజాసింగ్ రాజీనామా ఆమోదించిన భాజపా



ఈ కబురు,హైదరాబాద్: ఏ పార్టీలో చేరాలనేదానిపై తాను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తాను భారత రాష్ట్ర సమితి లేదా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు కొన్ని మీడియా ఛానళ్లలో ప్రచారం జరుగుతోందని.. తప్పుడు వార్తలను వ్యాప్తి చేయొద్దని ఆయన కోరారు. కార్యకర్తలతో మాట్లాడి తదుపరి నిర్ణయాన్ని ప్రకటిస్తానని రాజాసింగ్ తెలిపారు. నా చివరి శ్వాస వరకు హిందుత్వం కోసమే పనిచేస్తా

భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావు నియామకాన్ని నిరసిస్తూ ఆ పార్టీకి రాజాసింగ్ రాజీనామా చేసిన విషయం తెలిసిదే. ఆయన రాజీనామాను భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం ఆమోదించారు. ఈ క్రమంలో ఆయన ఏ పార్టీలో చేరతారనే అంశంపై పలు ఊహాగానాలు వస్తున్నాయి. దీంతో రాజాసింగ్ స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు.

**రాజాసింగ్ రాజీనామా ఆమోదించిన భాజపా**

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను భాజపా అధిష్ఠానం ఆమోదించింది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించామని, ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటన విడుదల చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక విషయంలో అలిగిన రాజాసింగ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ అందజేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు తనను అనుమతించలేదని, అందుకే రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు.

# యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి

ఈ కబురు: ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల తదితర ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని, ఈ ప్రయాణంలో సివిల్ ఇంజనీర్లు భాగస్వామ్యం కావాలని కోరారు. మూడున్నరేళ్లలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్(హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నెక్స్ట్ జెన్ హైరైస్ బిల్డింగ్స్ (అడ్వాన్స్మెంట్స్ ఇన్ కాంపోజిట్, స్టీల్ స్ట్రక్చర్స్) అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు.2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ. 80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. రాష్ట్ర సేవల స్థూల విలువ జోడింపులో ఇది 24.9 శాతం. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనం అని మంత్రి వివరించారు. ఇటీవల కాలంలో దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో హైరైస్ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. మన హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్నభవనాల సంఖ్య 200 కంటే ఎక్కువగా ఉంది. మరో 250 భవనాల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటి తరుణంలోనే మనం పర్యావరణహితంగా అడుగులు వేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో రీన్‌ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్ (ఆర్ సీసీ) నిర్మాణాలకు బదులుగా కాంపోజిట్, స్టీల్ స్ట్రక్చర్స్ కు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది అని అభిప్రాయపడ్డారు. కంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ వినియోగం వల్ల భవనం పూర్తయ్యేందుకు పట్టే సమయం 40 శాతం, భారం 30 శాతం తగ్గుతుంది. భూకంపాలను సమర్థవంతంగా తట్టుకోగలవు. నిర్మాణ సమయంలో వెలువడే కాలుష్యం తగ్గుతుంది. మరీ ముఖ్యంగా పునర్వినియోగం వల్ల సర్క్యులర్ ఎకానమీ వృద్ధి చెందుతుంది అని చెప్పారు. తెలంగాణలో ఆవిష్కరణలు కేవలం మాటలకే పరిమితం కావడం లేదు. ఆచరణలోనూ చూపిస్తున్నాము.భావితరాల కోసం కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాం. ఇందుకు నగరవాసులకు అందుబాటులోకి తెచ్చిన స్టీల్ వంతెనలు గొప్ప ఉదాహరణ. నిర్మాణ రంగంలో ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా నిర్మాణ అనుమతుల్లో వేగం, జవాబుదారీతనం, విశ్వాసాన్ని పెంపొందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం అని పేర్కొన్నారు. కాంపోజిట్ స్టీల్ హైరైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు(కోడ్) తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాడర్డ్స్ (బీఐఎస్)తో కలిసి పని చేస్తామన్నారు. సాంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వం ఎల్లపుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు సూచించారు. స్మార్ట్ నగరాలు, స్థిరమైన గృహ నిర్మాణం, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులు ఎస్ జీఎస్ మూర్తి, మహేందర్ రెడ్డి, శేషాద్రి, కాశీరాం, నర్మదా, రమేష్, భీం రావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఇంజినీరింగ్ కళాశాలలకు హైకోర్టులో చుక్కెదురు

ఈ కబురు,హైదరాబాద్: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు హైకోర్టులో చుక్కెదురైంది. ఫీజులు పెంచుకునేందుకు అనుమతివ్వాలని ఆయా కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫీజుల పెంపు కోసం ఇచ్చిన వినతులపై టీఏఎఫ్ఆర్‌సీ (తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ) నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆరువారాల్లో నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించింది. ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయంపైనే ఫీజుల పెంపు ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది.ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపునకు సంబంధించి ఏటా ఓ తంతు నడుస్తోందంటూ టీఏఎఫ్ఆర్‌సీ తీరుపై నిన్న విచారణ సందర్భంగా హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏటా కాలేజీలు ఫీజుల పెంపునకు ప్రతిపాదనలు చేయడం, కౌన్సెలింగ్ పూర్తయి అడ్మిషన్‌లు చేపట్టేదాకా దానిపై టీఏఎఫ్ఆర్‌సీ సిఫారసులు చేయకపోవడం, కాలేజీలు కోర్టును ఆశ్రయించడం అన్నది ఏటా కొనసాగుతోందని వ్యాఖ్యానించింది. ఇంజినీరింగ్ కాలేజీల్లో గత బ్లాక్ పీరియడ్ ఫీజులే 202526కు వర్తిస్తాయంటూ జారీ చేసిన జీవో 26ను సవాలు చేస్తూ గురునానక్, గోకరాజు రంగరాజు కాలేజీలతో పాటు సుమారు 11 కళాశాలలు గురువారం లంచ్ మోషన్ పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి మూడేళ్లకోసారి కాలేజీలను పరిశీలించి పెంపుపై నిర్ణయం తీసుకోలేకపోవడం సరికాదన్నారు. డిసెంబరులో ప్రతిపాదనలు వస్తే జూన్ వరకు నిర్ణయం తీసుకోలేదని, 15 మంది సభ్యులదాకా ఉన్న కమిటీ నిర్ణయంలో జాప్యమెందుకన్నారు. టీఏఎఫ్ఆర్‌సీపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదని, కౌన్సెలింగ్ పూర్తయ్యాక పిటిషన్‌లు వేయడమేమిటని కాలేజీలను ప్రశ్నించారు. కళాశాలల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ గత డిసెంబరులో ప్రతిపాదనలు సమర్పించామని, మార్చిలో కమిటీ సమావేశమైందని, అందులో తమ ప్రతిపాదనలు ఆమోదించిందని, దీనికి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలే నిదర్శనమన్నారు. టీఏఎఫ్ఆర్‌సీ తరఫు సీనియర్ న్యాయవాది పి.శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ కాలేజీలు 5,000 పేజీలతో ప్రతిపాదనలు సమర్పించాయని, వీటిని పరిశీలించడానికి సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో గత బ్లాక్ పీరియడ్‌లో వసూలు చేసిన మొత్తాన్నే ఈ ఏడాదికి సిఫారసు చేసిందన్నారు. ప్రభుత్వం తరఫున రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ కాలేజీల్లో కొన్ని గత ఏడాది కంటే సుమారు 70 నుంచి 90 శాతం పెంపు అడుగుతున్నాయన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# భారత్‌కు నష్టం కలిగిందనే ఒక్క ఆధారం చూపండి.. అజిత్ డోభాల్ సవాల్

ఈ కబురు: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు. చైన్నైలోని ఓ కార్యక్రమానికి హాజరైన డోభాల్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు. సోషల్ మీడియాలో విదేశీ వార్తాసంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను డోభాల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది.. ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే అత్యంత కచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ.. భారత్‌కు నష్టం జరిగినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్నగీత కూడా పడనివ్వలేదని అన్నారు.భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని డోభాల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయన్నారు. పాకిస్థాన్ సైన్యం దిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్400తో మధ్యలోనే సమర్థమంతంగా పేల్చివేశాయని తెలిపారు. *



# అమెరికాలో అపర కుబేరులు మనవాళ్లే..

**విదేశాల్లో పుట్టి అమెరికాలో అపర కుబేరులుగా ఎదిగినవాళ్లలో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నారు. ఫోర్బ్స్ 2025 ర్యాంకింగ్స్‌లో 12 మంది భారత సంతతి బిలియనీర్లు చోటు దక్కించుకోవడంతో అత్యధిక మంది విదేశీ అమెరికన్ కుబేరులకు జన్మస్థానంగా భారత్ నిలిచింది. 2022లో కేవలం ఏడుగురు భారత సంతతి బిలియనీర్లు ఉండగా ఇప్పుడు గణనీయంగా పెరిగారు.**







అమెరికాలో విదేశీ సంతతి సంపన్నుల తాజా జాబితాలో భారత్.. ఇజ్రాయెల్, తైవాన్‌లను అధిగమించింది. ఈ రెండు దేశాలకు చెందినవారు చెరో 11 మంది ఈ జాబితాలో ఉన్నారు. స్వయం కృషితో ఎదిగిన ఈ భారత సంతతి కుబేరులు.. విదేశాలలో జన్మించిన యూఎస్ బిలియనీర్ల మొత్తం 1.3 ట్రిలియన్ డాలర్ల సంపదలో గణనీయ వాటాను అందిస్తున్నారు. ఆల్ఫాబెట్ అధినేత సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల వంటి కొత్తవారు ఇటీవల ఈ జాబితాలో చేరినప్పటికీ అంతగా గుర్తింపు లేని దిగ్గజాలతో పోలిస్తే వారు ఆశ్చర్యకరంగా తక్కువ ర్యాంకులో ఉన్నారు. సైబర్ సెక్యూరిటీ దిగ్గజం జెడ్ స్కేలర్ వ్యవస్థాపకుడు జే చౌదరి 17.9 బిలియన్ డాలర్ల సంపదతో భారత సంతతి అమెరికన్ బిలియనీర్లలో అగ్రస్థానంలో ఉన్నారు. విద్యుత్తు, నీరు లేని మారుమూల హిమాలయ గ్రామం పనోహ్ లో జన్మించిన చౌదరి గ్రాడ్యుయేట్ చదువుల కోసం 1980లో తొలిసారి అమెరికా వెళ్లారు.

**భారత సంతతి అపర కుబేరులు వీళ్లే..**

**జే చౌదరి (17.9 బిలియన్ డాలర్లు) - సైబర్ సెక్యూరిటీ (జెడ్ స్కేలర్)**

**వినోద్ ఖోస్లా (9.2 బిలియన్ డాలర్లు) - సన్ మైక్రో సిస్టమ్స్, వెంచర్ క్యాపిటల్**

**రాకేష్ గంగ్వాల్ (6.6 బిలియన్ డాలర్లు) - ఎయిర్‌లైన్స్ (ఇండిగో సహ వ్యవస్థాపకుడు)**

**రోమేష్ టి.వాధ్వానీ (5.0 బిలియన్ డాలర్లు) - సాఫ్ట్‌వేర్ - సింఫనీ టెక్నాలజీ గ్రూప్**

**రాజీవ్ జైన్ (4.8 బిలియన్ డాలర్లు) - ఫైనాన్స్ (జీక్యూజీ పార్ట్‌నర్స్ చైర్మన్)**

**కవితార్క్ రామ్ శ్రీరామ్ (3.0 బిలియన్ డాలర్లు) - గూగుల్, వెంచర్ క్యాపిటల్**

**రాజ్ సర్దానా (2.0 బిలియన్ డాలర్లు) - టెక్నాలజీ సేవలు (ఐటీ సంస్థ టీసీజీఐ)**

**డేవిడ్ పాల్ (1.5 బిలియన్ డాలర్లు) - వైద్య పరికరాలు (వెల్కెవ్స్ట్ / న్యూరోసిగ్మా)నికేష్ అరోరా (1.4 బిలియన్ డాలర్లు) - సైబర్ సెక్యూరిటీ (పాలో ఆల్టో నెట్వర్క్స సీఈఓ)**

**ఫోర్బ్స్ తాజా డేటా ఆధారంగా అమెరికాలోని అత్యంత ధనవంతులైన భారత సంతతి బిలియనీర్లు వీరే. టెక్ దిగ్గజాలు సుందర్ పిచాయ్ (1.1 బిలియన్ డాలర్లు), సత్య నాదెళ్ల (1.1 బిలియన్ డాలర్లు) 10, 11వ స్థానాల్లో నిలిచారు.**



## ఐటీ షేర్లు టపటప.. భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

టీసీఎస్ త్రైమాసిక (క్యూ1) రాబడులు ఆశించిన దానికంటే బలహీనంగా ఉండటంతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు శుక్రవారం ఐటీ షేర్లలో అమ్మకాలతో నష్టాల్లో ముగిశాయి. దీనికి తోడు కెనడాపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా వాణిజ్య సుంకాలు విధించిన తర్వాత పెరుగుతున్న ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు కూడా సెంటిమెంట్ ను దెబ్బతీశాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 689.81 పాయింట్లు లేదా 0.83 శాతం క్షీణించి 82,500.47 స్థాయిలలో ముగియగా, నిఫ్టీ 50 కూడా 205.4 పాయింట్లు లేదా 0.81 శాతం క్షీణించి 25,149.85 స్థాయిలలో స్థిరపడింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 0.88 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 1.02 శాతం చొప్పున నష్టపోయాయి.

రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఆటో దాదాపు 1.8 శాతం చొప్పున నష్టపోయాయి. టీసీఎస్ క్యూ1 రాబడులు ఊహించిన దానికంటే తక్కువగా ఉండటంతో ఐటీ షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. నిఫ్టీ రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా, ఎనర్జీ, బ్యాంక్, మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, ఫార్మా లాభాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ లోని 30 షేర్లలో 23 షేర్లు రెడ్‌లోనే ముగిశాయి. టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్సీఎల్ టెక్, టైటాన్ షేర్లు 3.5 శాతం వరకు నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, ఎటర్నల్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మార్కెట్ ఒడిదుడుకులను అంచనా వేసే ఇండియా వీఐఎక్స్ 1.24 శాతం లాభపడి 11.81 పాయింట్ల వద్ద స్థిరపడింది.




## అమెజాన్‌లోనే కొంటున్నారా? అమ్మో జాగ్రత్త!

ప్రముఖ ఈకామర్స్ సంస్థలో ప్రస్తుతం ప్రైమ్ డే సేల్ 2025 నడుస్తోంది. జూలై 1214 వరకు అమ్మకాలు జరుగుతుండగా దీనికి సంబంధించిన హడావుడి నాలుగు రోజుల ముందు హడావుడి ప్రారంభమైంది. అమెజాన్ ప్రైమ్ డే సేల్ 2025 కోసం ఓ వైపు కొనుగోలుదారులు సిద్ధమవుతుండగా, ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు కూడా వినియోగదారులను మోసం చేసేపనిలో పడ్డారు.

**అమెజాన్ లానే 1000 సైట్లు**

మెరుపు డీల్స్, డిస్కౌంట్ల కోసం లక్షలాది మంది లాగిన్ అవుతారని భావిస్తున్న నేపథ్యంలో ఈ షాపింగ్ ఉత్సుకత ఆన్‌లైన్ మోసాలకు తెరలేపుతుందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెక్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం, అమెజాన్‌ను పోలిన 1,000 కొత్త వెబ్‌సైట్లు 2025 జూన్‌లో నమోదయ్యాయి. వీటిలో 87% అనుమానాస్పదమైనవి లేదా పూర్తిగా హానికరమైనవిగా గుర్తించారు. ఈ సారూప్య డొమైన్లు చిన్న అక్షర తేడాలు లేదా ".టాప్" లేదా ".ఆన్‌లైన్" వంటి అసాధారణ ఎక్స్‌టెన్షన్‌లను కలిగి ఉంటాయి. ఇలా వినియోగదారులను నమ్మించి మోసగించడానికే వీటిని రూపొందించినట్లు కనిపిస్తోంది.

వినియోగదారులను మోసగించడానికి స్కామర్లు సాధారణంగా రెండు ప్రధాన ట్రిక్స్‌పై ఆధారపడతారు. అవి ఒకటి నకిలీ వెబ్‌సైట్లు, రెండోది ఫిషింగ్ ఈమెయిల్స్. అమెజాన్ చెక్‌అవుట్ లేదా లాగిన్ పేజీలను అనుకరించడానికి నకిలీ డొమైన్లు సృష్టిస్తున్నారు. అవి మొదటి చూసినప్పుడు అసలైన వెబ్‌సైట్‌ల లాగానే అనిపిస్తాయి. దీంతో వీటి ద్వారా కొనగోళ్లకు ప్రయత్నిస్తే మొత్తానికి మోసం వస్తుంది. పాస్‌వర్డ్‌లు, ఇతర వివరాలు కూడా చోరీకి గురయ్యే ప్రమాదం ఉంది.

ఇక మరో మార్గంలో "రీఫండ్ డ్యూ" లేదా "అకౌంట్ ప్రాబ్లమ్" వంటి విషయాలతో ఫిషింగ్ ఈమెయిల్స్ ఉన్నాయి. ఈ సందేశాలు మామూలుగా అమెజాన్ సపోర్ట్ టీమ్ నుండే వచ్చినట్లు అనిపిస్తాయి. అక్కడ కనిపించిన లింక్‌లను క్లిక్ చేస్తే స్కామ్ వెబ్‌సైట్లకు దారితీసే అవకాశం ఉంది. ప్రైమ్ డే సందర్భంగా కొనుగోలుదారులు హడావుడిగా ఉంటారని సైబర్ నేరగాళ్లకు తెలుసు. వారు మీ అత్యవసరతను తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటారు.

**కొన్ని జాగ్రత్తలు**

సురక్షితంగా ఉండటానికి నిపుణులు కొన్ని జాగ్రత్తలను సూచిస్తున్నారు. ఇవి సాధారణమైనవే కానీ శక్తివంతమైనవి. అవి.. అధికారిక అమెజాన్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే షాపింగ్ చేయండి. మీ ఖాతాను అప్డేట్ చేయమని లేదా రీఫండ్ క్లెయిమ్ చేయమని కోరే ఈమెయిల్స్ పట్ల జాగ్రత్తగా ఉండండి.ఆకర్షణీయంగా అనిపించే ఫ్లాష్ డీల్స్ జోలికి పోవద్దు. టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఎనేబుల్ చేయండి. మీ సాఫ్ట్‌వేర్, బ్రౌజర్లను అప్డేట్ చేసుకోండి.




## ఎల్ఐసీ ప్రీమియం ఆదాయం అదుర్స్

ప్రముఖ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ జూన్‌లో రూ.5,313 కోట్లు ప్రీమియం ఆదాయాన్ని సమకూర్చుకుంది. క్రితం ఏడాది ఇదే నెలలో ఆదాయంతో పోల్చి చూస్తే 14.60 శాతం పెరిగింది. ప్రైవేటు జీవిత బీమా సంస్థలతో పోల్చి చూసినా 12 శాతం పెరిగినట్టు ఎల్ఐసీ ప్రకటించింది. జూన్‌లో 25 ప్రైవేటు జీవిత బీమా సంస్థలు సంయుక్తంగా వసూలు చేసిన ఇండివిడ్యువల్ పాలసీల ప్రీమియం ఆదాయం రూ.8,408 కోట్లుగా ఉంది.

ఈ ఏడాది జూన్‌లో ఎల్ఐసీ 12.49 లక్షల కొత్త పాలసీలను జారీ చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఇలా జారీ చేసిన కొత్త పాలసీలు 14.65 లక్షలుగా ఉండడం గమనార్హం. ఇందులో వ్యక్తులకు సంబంధించిన పాలసీలు 12.48 లక్షలుగా ఉంటే, గ్రూప్ పాలసీలు 1,290గా ఉన్నాయి. ఎల్ఐసీకి గ్రూప్ పాలసీల ప్రీమియం ఆదాయం జూన్ నెలలో రూ.22,087 కోట్లుగా ఉంది.

గతేడాది జూన్ కంటే 7 శాతం తక్కువ. ప్రైవేటు జీవిత బీమా కంపెనీల గ్రూప్ ప్రీమియం ఆదాయం క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 19 శాతం తగ్గి రూ.5,315 కోట్లుగా ఉంది. ఎల్ఐసీ మొత్తం ప్రీమియం (ఇండివిడ్యువల్, గ్రూప్ కలసి) ఆదాయం జూన్ నెలలో 3.43 శాతం తక్కువగా రూ.27,395 కోట్లుగా నమోదైంది. ప్రైవేటు కంపెనీల మొత్తం ప్రీమియం ఆదాయం సైతం 2.45 శాతం తగ్గి రూ.13,722 కోట్లకు పరిమితమైంది.




## భారత్‌లో టెస్లా షోరూం ప్రారంభం ఈ వారంలోనే..

ఎలాన్ మస్క్‌కు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ టెస్లా భారత్‌లో తన తొలి షోరూంను ఈ వారంలోనే ప్రారంభించనుంది. టెస్లా భారత్‌లో తన మొదటి "ఎక్స్‌పీరియన్స్ సెంటర్" ను జూలై 15న ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో ప్రారంభించనుందని, ఇది భారత మార్కెట్లోకి ప్రవేశించడంలో కీలక అడుగు అని రాయిటర్స్ నివేదించింది. ఇందుకోసం టెస్లా 4,000 చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని మార్చిలో లీజుకు తీసుకుంది. ఈ ప్రాంతం యాపిల్ స్టోర్ కు సమీపంలో ఉంది.

భారత్‌లో విస్తృత విస్తరణ వ్యూహంలో భాగంగా టెస్లా ఈ నిర్ణయం తీసుకుంది. జూన్ లో ముంబైలోని కుర్లా వెస్ట్ లో ఒక వాణిజ్య స్థలాన్ని కంపెనీ లీజుకు తీసుకుంది. ఇది వాహన సర్వీస్ కేంద్రంగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పుణెలో ఇంజనీరింగ్ హబ్, బెంగళూరులో రిజిస్టర్డ్ కార్యాలయం, బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) సమీపంలో తాత్కాలిక కార్యాలయంతో సహా భారతదేశంలో టెస్లా మొత్తం వాణిజ్య ఆస్తులు నాలుగుకు చేరుకున్నాయి.కాగా కంపెనీ ఇండియా హెడ్ ప్రశాంత్ మీనన్ తొమ్మిదేళ్ల తర్వాత గత నెలలో రాజీనామా చేశారు. బ్లూమ్‌బెర్గ్ న్యూస్ ప్రకారం.. ప్రస్తుతానికి భారత కార్యకలాపాలను చైనాకు బృందం నిర్వహిస్తోంది. అయితే టెస్లా ప్రస్తుతం భారత్‌లో తయారీని స్థాపించడానికి ఆసక్తి చూపడం లేదని, కేవలం షోరూమ్‌లు తెరిచి దిగుమతి చేసుకున్న కార్లను విక్రయించాలనుకుంటోందని కేంద్రమంత్రి కుమారస్వామి గత నెలలో చెప్పారు.షోరూం ప్రారంభానికి ముందు కంపెనీ దాదాపు 1 మిలియన్ డాలర్ల (రూ.8.58 కోట్లు) ఎలక్ట్రిక్ వాహనాలు, సంబంధిత వస్తువులను దిగుమతి చేసుకుంది. జనవరి జూన్ మధ్య వాణిజ్య షిప్పింగ్ రికార్డుల డేటా ప్రకారం.. టెస్లా భారత్‌కు వాహనాలు, సూపర్ ఛార్జర్లు, ఇతర ఉపకరణాలను దిగుమతి చేసుకుంది. ఇందులో ప్రధానంగా చైనా, అమెరికాల నుండి దిగుమతి చేసుకున్న ఆరు కార్లలో మోడల్ వై కార్లు ఉన్నాయి. విదేశీ ఎలక్ట్రిక్ వాహనాలపై భారత్ సుమారు 70% దిగుమతి సుంకం విధిస్తున్నప్పటికీ టెస్లా ఈ వాహనాలను తీసుకువస్తోంది.



## గోల్డ్ ఈటీఎఫ్‌లు.. జిగేల్! ఏకంగా రూ.2,081 కోట్లు

బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు)కు జూన్‌లో బలమైన డిమాండ్ కనిపించింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో బంగారం ధరలు ఇటీవలి కాలంలో స్థిరమైన ర్యాలీ చేస్తుండడం ఇన్వెస్టర్లను మరింతంగా ఆకర్షిస్తోంది. జూన్ నెలలో ఏకంగా రూ.2,081 కోట్లను గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేశారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ గణాంకాలను విడుదల చేసింది. ఈ ఏడాది మే నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.292 కోట్లతో పోల్చి చూస్తే జూన్‌లో ఏడింతలైనట్టు తెలుస్తోంది. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.6 కోట్లు, మార్చిలో రూ.77 కోట్ల చొప్పున ఇన్వెస్టర్లు ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ కాలాన్ని పరిశీలించి చూస్తే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చిన నికర పెట్టుబడులు రూ.8,000 కోట్లుగా ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో గోల్డ్ ఈటీఎఫ్‌లు రూ.3,751 కోట్లను ఆకర్షించగా, ఆ తర్వాత తిరిగి జూన్‌లోనే గరిష్ట స్థాయిలో పెట్టుబడులు రావడం గమనించొచ్చు. జూన్‌లో రెండు గోల్డ్ ఈటీఎఫ్‌లు మొదటిసారి మార్కెట్లోకి వచ్చి (ఎన్ఎఫ్ఓలు) ఇన్వెస్టర్ల నుంచి రూ.41 కోట్లను సమీకరించాయి. జూన్ చివరికి గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణ ఆస్తుల విలువ మే చివరితో పోల్చి చూసినప్పుడు 4%పెరిగి (మే చివరి నుంచి) రూ.64,777 కోట్లకు చేరింది.

స్థిరమైన ధరలు, అనిశ్చిత పరిస్థితులు..

''జూన్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి బలమైన పెట్టుబడులు రావడం సెంటిమెంట్‌లో మార్పునకు నిదర్శనం. ధరలు స్థిరంగా ఉండడం, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ఈక్విటీ, డెట్ సాధనాల్లో అస్థిరతలు ఇందుకు కారణమై ఉండొచ్చు''అని మారోన్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెష్రామ్ తెలిపారు. కొత్త పథకాల ద్వారా నిధుల సమీకరణ కూడా మెరుగ్గానే ఉన్నట్టు చెప్పారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న ఆసక్తికి నిదర్శనంగా పేర్కొన్నారు. గోల్డ్ ఈటీఎఫ్‌లకు సంబంధించి ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) జూన్‌లో 2.85 లక్షలు పెరిగాయి. మొత్తం ఫోలియోలు 76.54 లక్షలకు చేరాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల ధరలు బంగారం మార్కెట్ ధరలనే ప్రతిఫలిస్తుంటాయి. ఒక ఈటీఎఫ్ యూనిట్ గ్రాము బంగారంతో సమానం. కానీ, కొన్ని ఫండ్స్ సంస్థలు ఇంతకంటే తక్కువ పరిమాణంలోనూ పెట్టుబడులకు అనుమతిస్తున్నాయి.



# సార్... మేడమ్ వస్తున్నారు



విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ జంటగా నటించిన చిత్రం 'సార్ మేడమ్'.పాండిరాజ్ దర్శకత్వంలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు.

పెళ్లికి ముందు ఓ అమ్మాయికి మెట్టినింటి వాళ్లు చెప్పే మాటలతో మొదలయ్యే టీజర్ భార్యాభర్తల మధ్య జరిగే ఫన్నీ గొడవతో సాగుతుంది. టీజర్ ప్రారంభంలో వంట మాస్టర్‌లా కనిపించిన విజయ్ సేతుపతి చివర్లో గన్ పట్టుకొని మాస్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. "రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రంలో విజయ్, నిత్యల నటన హైలెట్‌గా ఉంటుంది" అని చిత్రబృందం పేర్కొంది.

# తమిళ దర్శకుడితో చైతూ.. ఇదిగో క్లారిటీ



అక్కినేని హీరో నాగచైతన్య ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ తీస్తున్న ఓ సినిమాలో నటిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభమైంది. మరోవైపు నెక్స్ట్ ఏం మూవీ చేస్తాడా అని ఇప్పటినుంచే కొన్నిపేర్లు వినిపిస్తున్నాయి. వాటిలో తమిళ దర్శకుడు మిత్రన్ పేరు కూడా ఉంది. అయితే ఇప్పుడు వినిపిస్తున్న రూమర్లపై ఓ క్లారిటీ కూడా వచ్చేసింది.

తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్-నాగచైతన్య కాంబినేషన్‌లో ఓ స్పై డ్రామా సినిమా తీసేందుకు సన్నాహాలు మొదలయ్యాయని కోలీవుడ్ నుంచి సమాచారం వచ్చింది. అయితే చైతూ సన్నిహితులు చెబుతున్న దాని ప్రకారం అలాంటివే లేవని తెలుస్తోంది. తమిళంలో 'ఇరంబుదురై' (తెలుగులో 'అభిమన్యుడు'), 'సర్దార్' లాంటి హిట్ సినిమాలను తీసిన దర్శకుడు పీఎస్ మిత్రన్. ఒకవేళ ఈయనతో చైతూ సినిమా చేస్తే బాగానే ఉంటుంది. మరి భవిష్యత్తులో కాంబో సెట్ అవుతుందేమో చూడాలి.

# వారి కోసమే చాలా ఏళ్లు బతకాలని ఉంది: హెల్త్ రూమర్స్‌పై కరణ్ జోహార్



ప్రముఖ బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ ఇటీవలే ట్రైటర్స్ పేరుతో ఓ రియాలిటీ షోకు హోస్ట్‌గా వ్యవహరించారు. అమెజాన్ ప్రైమ్‌లో ప్రసారమైన ఈ షోలో బిగ్‌బాస్ నటి ఉర్ఫీ జావెద్‌తో నికితా లూథర్ విజేతగా నిలిచారు. అయితే కొద్ది రోజుల క్రితం కరణ్ లుక్ అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. మరి బక్కచిక్కిపోయి కనిపించడంతో అసలు ఏమైందని తెగ ఆరా తీశారు. ఇంత త్వరగా బరువు తగ్గడం ఎలా సాధ్యమంటూ నెటిజన్స్ ప్రశ్నించారు. కేవలం ఇంజక్షన్స్ ద్వారానే ఇలాంటివి సాధ్యమని కొందరు ఆరోపించారు.


ఈ నేపథ్యంలో తన వెయిట్ లాస్‌కు సంబంధించి వచ్చిన రూమర్స్‌పై మరోసారి స్పందించాడు. ధడక్ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కు హాజరైన కరణ్ జోహార్ తాను బరువు తగ్గడంపై మాట్లాడారు. నెటిజన్స్ తనను ఏకంగా చంపేశారని అన్నారు. నేను చాలా ఆరోగ్యంతో సంతోషంగా ఉన్నానని తెలిపారు.

కరణ్ మాట్లాడుతూ..'నేను బరువు తగ్గడానికి ఒకే ఒక కారణం ఉంది. నేను జీవితంలో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి చాలా సవాళ్లను స్వీకరించా. నెటిజన్స్‌కు నేను చెప్పేది ఏంటంటే.. నా పిల్లల కోసం చాలా ఏళ్ల పాటు బతకాలనుకుంటున్నా. నేను ఇంకా చెప్పాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. వాటిని మీ అందరికీ పరిచయం చేస్తా' అని అన్నారు.

**నెటిజన్స్ ట్రోల్స్**

కాగా.. గతంలో కరణ్ జోహార్ ఓజెంపిక్‌ను ఉపయోగించడం లేదని చేసిన వాదనలపై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. 'ఓజెంపిక్‌తో మీరు బరువు తగ్గారని అంగీకరించడంలో తప్పు లేదు. బరువు తగ్గడానికి చాలా సమయం పడుతుంది. బరువు మీ జీవితాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది, మీరు బరువు తగ్గిన తర్వాత బాగానే ఉంటే, మీరు దానిని ఎలా కోల్పోయారన్నది ముఖ్యం కాదు. మీరు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో గర్వపడండి మీ డ్రీమ్ అదే కదా .. ఉన్నది ఒక్కటే జీవితం. మన శరీరంతో సంతోషంగా ఉండాలనుకోవడంలో తప్పులేదు. ఆల్ ది బెస్ట్..' అంటూ ఒక నెటిజన్ కామెంట్ చేశాడు. ''అది ఓజెంపిక్ ముఖమే.. దానిని అంగీకరించడంలో సిగ్గు లేదు. ప్రపంచం మొత్తం ఇప్పుడు దీనిని ఉపయోగిస్తోంది .దాని గురించి బహిరంగంగా చెప్పే వ్యక్తులు గతంలో కంటే ఎక్కువ ప్రశంసలు దక్కించుకుంటున్నారు. సార్ నిజం నిర్భయంగా చెప్పడి" అంటూ మరో నెటిజన్ ప్రశ్నించాడు. దీంతో తాజాగా తనపై హెల్త్‌పై వచ్చిన రూమర్స్‌పై రిప్లై ఇచ్చారు కరణ్ జోహార్.

# ఆ సినిమాతో నా లైఫ్ మారిపోయింది: శృతిహాసన్



కోలీవుడ్ హీరోయిన్ శృతిహాసన్ ప్రస్తుతం కూలీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తోన్న ఈ సినిమాకు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి మోనికా అంటూ సాంగే రెండో పాటను రిలీజ్ చేశారు. ఈ పాటలో హీరోయిన్ పూజా హేగ్డే తన డ్యాన్స్‌త అదరగొట్టేసింది. ఆగస్టు 14న థియేటర్లలోకి రానున్న కూలీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీలో నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఆమిర్ ఖాన్ లాంటి స్టార్స్ కూడా నటించారు.

అయితే ఇటీవల సోషల్ మీడియాకు గుడ్‌బై చెప్పిన శృతిహాసన్.. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైంది. ఈ సందర్భంగా తన కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. ముఖ్యంగా తెలుగు సినిమా ఇండస్ట్రీపై ప్రశంసలు కురిపించింది. తనకు లైఫ్ ఇచ్చింది టాలీవుడ్ ఇండస్ట్రీనే అని తెలిపింది.

తెలుగులో గబ్బర్ సింగ్ సినిమా తన జీవితాన్నే మార్చిందని చెప్పుకొచ్చింది. కోలీవుడ్ తర్వాత నాకు సక్సెస్ ఇచ్చిందంటే కేవలం తెలుగు ఇండస్ట్రీ మాత్రమేనని వెల్లడించింది. డైరెక్టర్ హరీశ్ శంకర్ సార్ పట్టుబట్టి మరి ఆ రోల్ ఇచ్చారని గుర్తు చేసుకుంది. మా నాన్న ఫిల్మ్ ఫేర్ అవార్డ్‌ను తీసుకునేందుకు హైదరాబాద్‌కు వచ్చానని శృతిహాసన్ తెలిపింది.

# వింబుల్డన్ మ్యాచ్‌లో జాన్వీ కపూర్.. బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి!



దేవర బ్యూటీ జాన్వీ కపూర్ వింబుల్డన్ మ్యాచ్‌లో సందడి చేసింది. తన బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహారియాతో కలిసి మ్యాచ్‌కు హాజరైంది. లండన్‌లో జరుగుతున్న టోర్నీలో మెరిసింది. ఇది చూసిన నెటిజన్స్ జాన్వీ కపూర్‌ను ఉద్దేశించి క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. కొందరు నెటిజన్స్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే జాన్వీ కపూర్- శిఖర్ చాలాసార్లు ఇలా విదేశాల్లో చిల్ అవుతూ కనిపించారు.

ఇక సినిమాల విషయానికొస్తే జాన్వీ కపూర్ ప్రస్తుతం పెద్ది చిత్రంలో కనిపించనుంది. రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాకు బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటు హోమ్‌బౌండ్, సన్నీ సంస్కారి కి తులసి కుమారి, పరమ్ సుందరి లాంటి బాలీవుడ్ సినిమాల్లో కనిపించనుంది. పరం సుందరి జూలై 24, 2025న విడుదల కావాల్సి ఉండగా.. ఈ చిత్రం వాయిదా పడినట్లు తెలుస్తోంది.

# పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ వచ్చేసింది



సూపర్‌స్టార్ రజినీకాంత్ లేటెస్ట్ మూవీ 'కూలీ'. ఇదివరకే చికిటు అనే పాట రిలీజ్ కాగా.. ఇప్పుడు మోనికా అంటూ సాగే రెండో సాంగ్ రిలీజ్ చేశారు. పూజా హెగ్డే చేసిన స్పెషల్ పాట ఇది. రెడ్ కలర్ డ్రస్సుల్లో గ్లామర్ చూపిస్తూ పూజ డ్యాన్స్ బాగానే చేసింది. కాకపోతే అనిరుధ్ గతంలో కంపోజ్ చేసిన సాంగ్స్‌లా ఇదేం ప్రత్యేకంగా అనిపించలేదు. కాకపోతే కలర్‌ఫుల్‌గానే ఉంది.

ఈ పాటని వైజాగ్ పోర్ట్‌లో తీసినట్లు తెలుస్తోంది. పూజా హెగ్డేతో పాటు సౌబిన్ షాహిర్ డ్యాన్సులు వేస్తూ కనిపించాడు. ఇదే గీతంలో విలన్ పాత్ర చేస్తున్న నాగార్జున కూడా స్టెప్పులేశాడు. కాకపోతే ఆ విజువల్స్.. లిరికల్ వీడియోలో పెట్టలేదు. థియేటర్లలో అవి ఉంటాయని తెలుస్తోంది. ఆగస్టు 14న థియేటర్లలోకి రానున్న 'కూలీ'లో రజినీతో పాటు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్, ఆమిర్ ఖాన్.. ఇలా స్టార్స్ బోలెడంత మంది ఉన్నారు. హైప్ కూడా గట్టిగానే ఉంది.



# సెమీఫైనల్లో జ్యోతి సురేఖ, పర్ణీత్

**మాడ్రిడ్:** ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4 టోర్నమెంట్ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి సురేఖ 147-144తో హజల్ బురున్ (తుర్కియే)పై, పర్ణీత్ కౌర్ 142-141తో క్యూర్ గిరిడి (తుర్కియే)పై విజయం సాధించారు. మరోవైపు రికర్వ్ విభాగంలో భారత జట్లకు నిరాశ ఎదురైంది. భారత పురుషుల, మహిళల జట్లు కనీసం మూడో రౌండ్‌కు కూడా చేరుకోలేకపోయాయి.

ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, రాహుల్, నీరజ్ చౌహాన్‌లతో కూడిన భారత పురుషుల జట్టు రెండో రౌండ్‌లో 2-6 (55-56, 54-57, 57-56, 54-56) సెట్ పాయింట్ల స్కోరుతో జ్విక్ ఎలీ, మార్కస్ అల్మీదా, మథియాస్ గోమ్స్‌లతో కూడిన బ్రెజిల్ జట్టు చేతిలో ఓడిపోయింది.

దీపిక కుమారి, అంకిత, గాథ ఖడకేలతో కూడిన భారత మహిళల జట్టు కూడా రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత జట్టు రెండో రౌండ్‌లో 3-5 (58-54, 55-55, 54-55, 53-54) సెట్ పాయింట్ల స్కోరుతో అమెలీ కార్డెయు, లీసా బార్బెలిన్, విక్టోరియా సెబాస్టియన్‌లతో కూడిన ఫ్రాన్స్ జట్టు చేతిలో ఓటమి పాలైంది.



# ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు.. రెండో రోజు ముగిసిన ఆట

**లార్డ్స్ :** అండర్సన్‌తెండుల్కర్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. ఓవర్ నైట్ స్కోర్ 251/4తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌట్ అయింది. రూట్ (104) శతకం చేయగా, బ్రైడన్ కార్స్ (56), జేమీ స్మిత్ (51) అర్ధశతకాలు చేశారు. భారత బౌలర్లలో బుమ్రా 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి 145/3 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్ (53), రిషభ్ పంత్ (19) ఉన్నారు. ప్రస్తుతం భారత్ 242 పరుగుల దూరంలో వెనకబడి ఉంది. రెండో రోజు ఆటలో కేవలం 75 ఓవర్లే వేశారు.

**నిలబడిన రాహుల్..**

యశస్వి జైస్వాల్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. మూడు ఫోర్లు కొట్టి ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించిన జైస్వాల్ (13).. ఆర్చర్‌కు చిక్కాడు. రెండో ఓవర్ మూడో బంతికి స్లిప్స్‌లో ఉన్న హ్యారీ బ్రూక్‌కు క్యాచ్ ఇచ్చి యశస్వి వెనుదిరిగాడు. దీంతో క్రీజులోకి వచ్చిన కరుణ్ నాయర్ (40: 62 బంతుల్లో 4 ఫోర్లు)తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడిన వీరు అడపాదడపా షాట్లతో అలరించారు. దీంతో టీ బ్రేక్ ముగిసే సమయానికి భారత్ 44 పరుగులతో నిలిచింది.

ఓవైపు రాహుల్ క్రీజులో నిలుదొక్కుకునేందుకు ప్రయత్నించగా.. కరుణ్ నాయర్ వేగంగా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో జట్టు స్కోర్ 74 పరుగుల వద్ద స్టోక్స్ బౌలింగ్‌లో రూట్‌కు క్యాచ్ ఇచ్చి కరుణ్ ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ శుభమన్ గిల్ (16) క్రీజులోకి వచ్చాడు. గత రెండు మ్యాచ్‌ల్లో సూపర్ ఫామ్‌తో అదరగొట్టిన గిల్ ఈ సారి భారీ స్కోర్ చేయడంలో విఫలమయ్యాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో 107 పరుగుల వద్ద జేమీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో భారత్ కాస్త ఒత్తిడికి గురైంది. అయితే రిషభ్ పంత్ (19*)తో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లిన రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడాడు. ఈ క్రమంలో 39వ ఓవర్ తొలిబంతికి బషీర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి రాహుల్ అర్ధశతకం చేశాడు.

**ఐదు వికెట్లతో అదరగొట్టిన బుమ్రా..**

ఓవర్‌నైట్ స్కోర్ 251 పరుగులతో రెండో రోజు ఇన్నింగ్స్ మొదలుపెట్టిన పెట్టిన ఇంగ్లాండ్‌కు బుమ్రా షాక్ ఇచ్చాడు. 260 పరుగుల వద్ద ఆ జట్టు కెప్టెన్ స్టోక్స్‌ను (44) ఔట్ చేశాడు. అయితే శతకం చేసిన ఆనందంలో ఉన్న రూట్ (104)ను మరో అద్భుత బంతితో బుమ్రా బౌల్డ్‌చేశాడు. ఆ తర్వాత బంతికే క్రిస్ వోక్స్‌ను బుమ్రా బోల్తా కొట్టించాడు. దీంతో ఆ జట్టు 271 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. 300 పరుగులలోపే ఆ జట్టు ఆలౌట్ అయ్యేలా కనిపించింది. అయితే జేమీ స్మిత్ (51: 56 బంతుల్లో), బ్రైడన్ కార్స్ (56) మరో వికెట్ పడకుండా ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. లంచ్ బ్రేక్ ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 353/7 స్కోర్‌తో నిలిచింది. అయితే ఈ జోడీని సిరాజ్ విడదీశాడు. 355 పరుగుల వద్ద కీపర్ ధ్రువ్ జురేల్‌కు క్యాచ్ ఇచ్చి స్మిత్ ఔటయ్యాడు. ఎనిమిదో వికెట్‌కు స్మిత్, బ్రైడన్ జోడీ 87 పరుగులు జోడించారు. అనంతరం బుమ్రా బౌలింగ్‌లో ఆర్చర్ బౌల్డ్ అయ్యాడు. అనంతరం 387 పరుగుల వద్ద సిరాజ్ బౌలింగ్‌లో బ్రైడన్ కార్స్ క్లీన్ బౌల్డ్ కావడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ముగిసింది.



# లార్డ్స్ టెస్టులో టీమిండియాకు గుడ్ న్యూస్..

లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. చేతి వేలి గాయం కారణంగా ఫీల్డింగ్‌కు దూరమైన వికెట్ కీపర్ రిషబ్ పంత్.. తిరిగి బ్యాటింగ్‌కు రానున్నాడు. ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చేందుకు పంత్ ప్యాడ్స్ కట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.

కాగా తొలి రోజు ఆట సందర్భంగా బుమ్రా బౌలింగ్‌లో పంత్ చూపుడు వేలికి గాయమైంది. దీంతో ఆట మధ్యలోనే మైదానం నుంచి బయటకు వెళ్లిపోయాడు. రెండో రోజు ఆటలో కూడా పంత్ ఫీల్డింగ్ రాలేదు. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు.

**నెట్స్‌లో ప్రాక్టీస్ చేసిన పంత్..**

అయితే రెండో రోజు ఆట ఆరంభానికి ముందు రిషబ్ పంత్.. బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్, ఫిజియో యోగేష్ పర్మార్ పర్యవేక్షణలో ద్దరు త్రోడౌన్ స్పెషలిస్టులతో కలిసి పంత్ నెట్ ప్రాక్టీస్ చేశాడు. ఈ సందర్భంగా అతడు కాస్త ఆసౌకర్యంగా కన్పించాడు.

ఇంకా అతడికి ఇంకా పూర్తిగా చేతి వేలి నొప్పి తగ్గనట్లు తెలుస్తోంది. అయినప్పటికి జట్టు అవసరం దృష్ట్యా అతడు బ్యాటింగ్‌కు రావాలని అతడి నిర్ణయించుకున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. కాగా రిషబ్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లో సెంచరీల మోత మ్రోగించిన పంత్..రెండో టెస్టులో హాఫ్ సెంచరీతో మెరిశాడు.



# ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

**అనుభవ లేమితోనే ప్రో లీగ్‌లో పేలవ ప్రదర్శన**

**సీనియర్లు లేకపోవడంతో జట్టు డీలా**

**భారత మహిళల హాకీ జట్టు హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** యువ క్రీడాకారిణులు మరింత బాధ్యతగా ఆడాల్సిన అవసరముందని భారత మహిళల హాకీ జట్టు ప్రధాన కోచ్ హరేంద్ర సింగ్ అన్నాడు. లేకుంటే జట్టు సీనియర్ ప్లేయర్లపై ఎక్కువ ఆధారపడాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. మ్యాచ్‌కు ముందు ఎంత బాగా శిక్షణ పొందినా... ఒక్కసారి మైదానంలో అడుగు పెట్టాక అప్పటికప్పుడు వ్యూహాలు మార్చుకుంటూ ముందుకు సాగితేనే ఫలితాలు అనుకూలంగా వస్తాయని ఆయన వెల్లడించాడు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్ యూరప్ అంచె పోటీల్లో భారత మహిళల హాకీ జట్టు ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది.ఈ నేపథ్యంలో హరేంద్ర సింగ్ మాట్లాడుతూ... 'ప్రో లీగ్‌లో యువ జట్టుతో బరిలోకి దిగాం. పలువురు అనుభజ్ఞులైన ప్లేయర్లు గాయాలతో యూరప్ అంచె పోటీలకు దూరమవడం ఫలితాలపై ప్రభావం చూపింది. ముఖ్యంగా డిఫెన్స్ మరీ బలహీనంగా మారింది. దీంతో ప్రత్యర్థులు సులువుగా గోల్స్ చేస్తూ జట్టుపై ఒత్తిడి పెంచారు. దీనిపై మరింత కృషి చేయాల్సిన అవసరముంది. అనుభవరాహిత్యం కారణంగా యువ ప్లేయర్లు తాము మైదానంలో ఎక్కడ ఉన్నాం... తమ బాధ్యత ఏంటి అనే విషయంలో కాస్త అయోమయానికి గురయ్యారనేది సుస్పష్టం. అందుకే పరిస్థితులకు తగ్గట్లు ముందుకు సాగాలి. లేకుంటే తిరిగి సీనియర్ ఆటగాళ్లపైనే భారం మోపాల్సి ఉంటుంది. ఫీల్డ్‌లో నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం పనికిరాదు. ఎంత వేగంగా స్పందిస్తే అంత మెరుగైన ఫలితం సాధించవచ్చు. ప్రత్యర్థి సర్కిల్‌లోకి ప్రవేశిస్తే... గోల్ పోస్ట్‌పై దాడులు చేసేందుకు వెరవకూడదు. పదేపదే దాడులు చేస్తూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెడితేనే మ్యాచ్‌పై పట్టు చిక్కుతుంది' అని అన్నాడు.

**సీనియర్లు అందుబాటులో లేకే...**

అంతర్జాతీయ స్థాయిలో అపార అనుభవం ఉన్న ప్లేయర్లు వేర్వేరు కారణాలతో జట్టుకు దూరం కావడంతోనే యూరప్ అంచె పోటీల్లో భారత ఆటతీరు మరీ తీసుకట్టులా మారిందని హరేంద్ర సింగ్ అన్నాడు. 'ప్రో లీగ్ ప్రారంభానికి ముందు సుశీలా చాను జట్టుకు దూరమైంది. నిక్కీ ప్రధాన్, ఉదిత గాయాలతో ఇబ్బంది పడుతుండటంతో వారికి విశ్రాంతినివ్వాల్సి వచ్చింది. దీంతో ముగ్గురు ప్రధాన డిఫెండర్లు లేకపోవడంతో మన రక్షణ పంక్తి బలహీనపడింది.

యువ స్ట్రయికర్ సంగీత కుమారి కూడా గాయం కారణంగా జట్టుకు దూరమైంది' అని హరేంద్ర వెల్లడించాడు. ప్లేయర్ల మానసిక బలాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు హరేంద్ర అన్నాడు. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ప్లేయర్లకు మానసికంగా దృఢంగా ఉండేవిధంగా శిక్షణ ఇచ్చిన మోహన్ అనే వ్యక్తిని జట్టు సహాయక సిబ్బందిలో చేర్చినట్లు తెలిపారు. ఒత్తిడిని అధిగమించడం, తక్షణం స్పందించే గుణం వంటి పలు కీలక అంశాల్లో అతడి శిక్షణ మన ప్లేయర్లకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి 15 వరకు హాంగ్జౌ వేదికగా ఆసియ కప్ జరగనుండగా... ఆ లోపు ప్లేయర్లను మానసికంగా మరింత సంసిద్ధం చేస్తామని హరేంద్ర అన్నాడు.

**అవకాశాలను వినియోగించుకుంటేనే...**

ప్రో లీగ్ యూరప్ అంచె పోటీల్లో భారత జట్టుకు ఎన్నో అవకాశాలు వచ్చినా... వాటిని సద్వినియోగ పరుచుకోలేకపోయింది. అనుభజ్ఞులు లేకపోవడంతో డిఫెన్స్ విభాగంలో వెనుకబడిన టీమిండియా... అటాకింగ్‌లోనూ ఆకట్టుకోలేకపోయింది. ముఖ్యంగా పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచడంలో మనవాళ్లు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

'పెనాల్టీ కార్నర్‌ల విషయంలో చాలా మెరుగపడాల్సి ఉంది. మెరుగైన ప్రత్యర్థులతో తలపడుతున్నప్పుడు ప్రతి అంశంలో పక్కాగా ఉండాలి. అది లోపించడం వల్లే ప్రో లీగ్ నుంచి ఉద్వాసన ఎదురైంది. అయితే ఇక్కడితో ఆగిపోము. ఈ లోపాలను సవరించుకొని మరింత బలంగా పుంజుకుంటాం. ప్రత్యర్థికి పదే పదే పెనాల్టీ కార్నర్ అవకాశాలు ఇవ్వడం దెబ్బకొట్టింది. అయితే సానుకూల అంశాలు కూడా ఉన్నాయి.

మనకంటే మెరుగైన జట్లతో మ్యాచ్‌ల్లో సైతం అమ్మాయిలు ఆకట్టుకున్నారు. కొన్ని తప్పిదాలను పక్కన పెడితే ప్రపంచ స్థాయి ఆటతీరు కనబర్చారు. ఆసియా కప్ ప్రారంభానికి ముందే ఈ తప్పులను సరిదిద్దుకుంటాం. ప్లేయర్లకు పెద్దగా అనుభవం లేదు. వారిని నిందించాలనుకోవడం లేదు. ఏడుగురు ఆటగాళ్లకు ఇదే తొలి ప్రో లీగ్' అని హరేంద్ర అన్నాడు.



# జో రూట్ ప్రపంచ రికార్డు..

లార్డ్స్ వేదికగా టీమిండియాతో జరుగుతున్న మూడో టెస్టులో ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ తన రికార్డుల వేటను కొనసాగిస్తున్నాడు. ఈ ఇంగ్లండ్ వెటరన్ మరో అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక అవుట్‌ఫీల్డ్ క్యాచ్‌లు అందుకున్న ప్లేయర్‌గా వరల్డ్ రికార్డు సృష్టించాడు.

భారత తొలి ఇన్నింగ్స్‌లో కరుణ్ నాయర్ క్యాచ్‌ను తీసుకున్న తర్వాత ఈ ఫీట్‌ను రూట్ సాధించాడు. సెకెండ్ స్లిప్‌లో రూట్ స్టన్నింగ్ క్యాచ్‌తో మెరిశాడు. రూట్ ఇప్పటివరకు ఔట్ ఫీల్డ్‌లో 211 క్యాచ్‌లు అందుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు టీమిండియా మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్(210) పేరిట ఉండేది.

తాజా మ్యాచ్‌తో ద్రవిడ్ రికార్డును రూట్ బ్రేక్ చేశాడు. అటు బ్యాటింగ్‌లోనూ రూట్ సత్తాచాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీతో రూట్ (104) మెరిశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 387 పరుగుల భారీ స్కోర్ చేయగల్గింది. అతడితో పాటు బ్రైడన్ కార్స్(56), జేమీ స్మిత్(51), ఓలీ పోప్(44), స్టోక్స్(44) రాణించారు. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లు పడగొట్టగా.. నితీశ్, సిరాజ్ తలా రెండు వికెట్లు సాధించారు.

**టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక అవుట్‌ఫీల్డ్ క్యాచ్‌లు అందుకున్న ప్లేయర్లు వీరే..**

**211*జో రూట్**
**210 రాహుల్ ద్రావిడ్**
**205 మహేల జయవర్ధనే**
**200 స్టీవెన్ స్మిత్**
**200 జాక్వెస్ కాలిస్**
**196 రికీ పాంటింగ్**